సాక్షి వికారాబాద్

బుధవారం, 14, జూన్, 2023



బడి బస్సులు భద్రమేనా?

స్కూళ్లు ప్రారంభం కావడంతో విద్యార్థులను తరలించే బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే రయ్‌రయ్ మంటున్నాయి. 8లో▸



ఎంపీపీపై అవిశ్వాసం

బషీరాబాద్ మండల పరిషత్ అధ్యక్షురాలు కరుణపై సొంత పార్టీ ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టారు. 8లో▸



శిరీష మృతిపై దర్యాప్తు

అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన శిరీష కేసును త్వరలోనే ఛేదిస్తామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. 8లో▸

వేడెక్కిన రాజకీయం

తాండూరులో రాజకీయం వేడెక్కుతోంది. ఎలక్షన్ కమిషన్ ఈనెల 2న ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. వచ్చే ఏడాది జనవరి 16లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు అలర్టయ్యాయి. దీంతో ఎక్కడ చూసినా రాజకీయ సందడి కనిపిస్తోంది. ఏ నోట విన్నా పొలిటికల్ చర్చ వినిపిస్తోంది. మరోవైపు ప్రధాన పార్టీలన్నీ ప్రచార పర్వం మొదలుపెట్టాయి.

- పోటాపోటీగా ప్రజల్లోకి వెళ్తున్న ప్రధాన పార్టీల నాయకులు
- ఆత్మీయ సమ్మేళనాలు, దశాబ్ది ఉత్సవాలతో బీఆర్‌ఎస్ సందడి
- తెలంగాణ ఇచ్చిన పార్టీని ఆదరించాలని కాంగ్రెస్ ప్రచారం
- పారదర్శకమైన పాలనకే ఓటేయాలని బీజేపీ నేతల పిలుపు







తాండూరు: ఈసారి అధికార బీఆర్‌ఎస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, బీజేపీ ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకున్నాయి. ఇందులో భాగంగా ఇరు పార్టీల నాయకులు జోరుగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని మిగిలిన అసెంబ్లీ సెగ్మెంట్లతో పోలిస్తే తాండూరులో పరిస్థితి ఎప్పుడూ కొంత భిన్నంగా ఉంటుంది. ఇటీవలికాలంలో నాయకులు పార్టీలు మారడం సర్వసాధారణమైంది. జిల్లా నేతలు మొదలుకుని గ్రామస్థాయి కార్యకర్తల వరకు కండువాలు మార్చేస్తున్నారు. అయితే అధికార పార్టీ టికెట్ ఎవరికి వస్తుందోననే టెన్షన్ అందరిలోనూ కనిపిస్తోంది. టికెట్ రాని వారు పార్టీ మారే అవకాశం లేకపోలేదనే చర్చ సాగుతోంది.

కాంగ్రెస్‌కు కంచుకోట

తాండూరు అసెంబ్లీ స్థానం గతం నుంచి కాంగ్రెస్‌కు కంచుకోట. ఈ విషయం దేశ రాజధాని ఢిల్లీలో ఉండే ఆ పార్టీ పెద్దల వరకూ తెలుసు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో పదిసార్లు కాంగ్రెస్, మూడు సార్లు టీడీపీ, ఒకసారి టీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. 2018 ముందస్తు ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టీఆర్‌ఎస్ గాలి వీచినా తాండూరులో హస్తం పార్టీయే జయకేతనం ఎగురవేసింది.

వర్గపోరుతోనూ పెరిగిన బలం

గడిచిన మూడేళ్లలో ఇక్కడ బీఆర్‌ఎస్ అత్యంత శక్తిమంతంగా ఎదిగింది. తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఎవరికి వారే తమ కేడర్‌ను పెంచుకున్నప్పటికీ సంస్థాగతంగా పార్టీ మాత్రం బలపడింది. రెండు నెలలుగా రోహిత్‌రెడ్డి జనంలోనే ఉంటున్నారు. ప్రతీ మండలంలో పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి కేడర్, ప్రజల దృష్టిని ఆకర్షించారు. మరోవైపు ఇటీవలే తాండూరులో నిర్వహించిన గృహ ప్రవేశ వేడుకకు వేలాది మంది బంధుమిత్రులు, అభిమానులు కార్యకర్తలతో బలగం చూపించుకున్నారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్సీ వర్గం దూరంగా ఉంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి సైతం నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. శుభ, అశుభ కార్యాల్లో పాల్గొంటూ నేనున్నానని కేడర్‌కు ధైర్యం అందిస్తున్నారు. పీఎమ్మార్ పేరుతో టోర్నమెంట్లు ఏర్పాటు చేసి కొడుకు రినీష్‌రెడ్డిని రంగంలోకి దింపారు. తనయుడి ద్వారా యువతను ఆకట్టుకునే పనిలో ఉన్నారు. అయితే వికారాబాద్‌కు చెందిన ఉద్యమకారుడు, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ సైతం తాండూరుపై దృష్టిసారించారు. పట్టణంలో సొంత కార్యాలయం ఏర్పాటు చేసుకుని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఒక్క చాన్స్ ప్లీజ్..

తాండూరు నియోజకవర్గంలో మహరాజుల కుటుంబానికి దశాబ్దాలుగా మంచి పేరుంది. ఏడు పర్యాయాలు ఈ ఇంటికి చెందిన అభ్యర్థులే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈఒక్కసారి తనకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పీసీసీ మెంబర్ రమేశ్‌మహరాజ్ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరుతున్నారు. అయితే రానున్న రోజుల్లో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం లేకపోలేదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

చాపకింద నీరులా కమలం

ప్రభుత్వం వైఫల్యాలపై గొంతెత్తుతున్న కమలనాథులు జనంలోని వ్యతిరేకతను క్యాష్ చేసుకోవాలని చూస్తున్నారు. తాండూరు అసెంబ్లీ టికెట్ కోసం ముగ్గురు నేతలు పోటీ పడుతున్నారు. వీరిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణగౌడ్, మాజీ మంత్రి చందుమహరాజ్ తనయుడు నరేశ్‌మహరాజ్ టికెట్ ఆశిస్తున్నారు. అధిష్టానం ఎవరికి అవకాశం కల్పించినా సమష్టిగా పనిచేసి గెలవాలనే దిశగా సాగుతున్నారు. ఎలాంటి హడావుడి లేకుండా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ చాపకింద నీరులా క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసుకుంటున్నారు. దేశంలో ఎలాంటి స్కాంలకు అవకాశం లేకుండా పారదర్శకమైన పాలన అందిస్తున్న మోదీ సర్కారుకు మద్దతు పలకాలని కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హాల్దర్

చట్టం ముందు అందరూ సమానమే

- కులాల పేరుతో గొడవలు తగవు
- జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హాల్దర్
- బ్రాహ్మణపల్లి ఘర్షణపై వివరాల సేకరణ
- బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం

దోమ: చట్టం ముందు అందరూ సమానమేనని, కులాల పేరుతో గొడవలు తగవని జాతీయ ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హాల్దర్ అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో దళితుల ఆలయ ప్రవేశం విషయమై ఇటీవల ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ మేరకు జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డితో కలిసి మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. ముందుగా గ్రామంలోని ఆలయంలో పూజలు చేసిన అనంతరం స్థానికులతో సమావేశమై మాట్లాడారు. దేశంలో సామాజిక మార్పు కోసం ప్రజలను జాగృత పర్చాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలోనూ అంటరానితనం కొనసాగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. సమాజంలో ఇలాంటి అసమానతలను తొలగించడానికి రాజకీయాలకు అతీతంగా జనాలను చైతన్యం చేయాలన్నారు. బ్రాహ్మణపల్లిలో జరిగిన ఘటనలు జిల్లాలో ఎక్కడా పునరావృతం కాకుండా నిఘా పెట్టాలని సూచించారు. ఘటనకు బాధ్యులపైన వారిపై 302 సెక్షన్ అమలు చేసి త్వరితగతిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఘటన జరిగిన రోజే ఎస్‌ఐ విశ్వజన్ అప్రమత్తమై జిల్లా అధికారులతో కలసి బాధ్యులను గుర్తించి జైలుకు పంపడంపై ఎస్పీ కోటిరెడ్డి, ఎస్‌ఐని అభినందించారు.

సోదర భావంతో మెలగాలి

కులాలకు అతీతంగా ప్రజలంతా సోదరభావంతో కలసి మెలసి ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బడి, గుడి అందరివని కులాల ప్రస్తావన ఇక్కడ రావద్దని సూచించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీయకుండా ఆలయాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఇలాంటి ఘటనలు మళ్లీ రిపీట్ కాకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు.

పెద్దన్న పాత్ర పోషిస్తాం..

జిల్లాలో ఎలాంటి ఘటనలు జరిగినా పెద్దన్న పాత్ర పోషిస్తుందని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. బ్రాహ్మణపల్లిలో జరిగిన ఘటనపై వెంటనే స్పందించి బాధ్యులైన 35 మందిపై కేసు నమోదు చేసి, 20 మందిని రిమాండ్‌కు తరలించామని, మరో ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నారని తెలిపారు. మిగిలిన వారిని త్వరలోనే పట్టుకుని కోర్టులో ప్రవేశపెడతామని స్పష్టంచేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే 100 నంబర్‌కు డయల్ చేసి చెప్పాలన్నారు. అనంతరం బాధితులైన రఘురాం, అనసూయమ్మకు ఎస్సీ కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హాల్దర్, కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా రూ.25 వేల చొప్పున పరిహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోజెస్, అడిషన్ ఎస్పీ మురళీధర్, తహసీల్దార్ షాహెదబేగం, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాం, ఆర్‌ఐలు లింగం, శివప్రసాద్, సీఐ వెంకటరామయ్య, ఎస్‌ఐలు గిరి, శ్రీశైలం, ఇంటలిజెన్స్ విభాగం అధికారులు, ఎస్‌బీ సీఐ రామకృష్ణ, కానిస్టేబుల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

టమాటా కిలో రూ.40



పెద్దేముల్ సంతలో కూరగాయలు

పెద్దేముల్: పదిహేను రోజులుగా కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. 20 రోజుల క్రితం రూ.10 కిలో పలికిన టమాటా నాలుగింతలు పెరిగింది. పెద్దేముల్‌లో మంగళవారం జరిగిన వారాంతపు సంతలో ఏ కూరగాయ కొనాలన్నా కిలోకు రూ.50 నుంచి రూ.80 తగ్గలేదు. టమాటా రూ.40, బీరకాయ రూ.80 చొప్పున విక్రయించారు. దీంతో వినియోగదారులు అవస్థలు పడ్డారు. కిలో బదులు పావు కిలోతో సరిపెట్టుకున్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలి

వికారాబాద్ అర్బన్: భారత ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బీటీ పత్తి విత్తనాలు విక్రయించాలని, ఎక్కువ ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నాసిరకం, లూజ్, ప్రభుత్వ ఆమోదం లేని సీడ్స్ విక్రయించకూడదని తెలిపారు. రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కృత్రిమ కొరత సృష్టిస్తే ఊరుకునేది లేదన్నారు. విత్తనాల క్రయవిక్రయాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలని, రైతులకు ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని సూచించారు. బీజీ- 1 పత్తి విత్తనాల ప్యాకెట్‌ను (450 గ్రాముల) రూ.635, బీజీ- 2 విత్తనాల ప్యాకెట్‌ను రూ.853 చొప్పున విక్రయించాలని పేర్కొన్నారు. ఎవరైనా ఎక్కువ ధర తీసుకున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

నేటి వైద్యారోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

వికారాబాద్ అర్బన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్యారోగ్య దినోత్సవాన్ని నాలుగు నియోజకవర్గాల్లో బుధవారం పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఏపీవోలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్ ఈఈలతో మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆస్పత్రుల్లోని ఇన్‌పేషెంట్లకు పండ్లు పంపిణీ చేయా లని సూచించారు. అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించాలని తెలిపారు. ఆశలు, ఏఎన్‌ఎంలకు చీరలు పంపిణీ చేయాలన్నారు.

ఆరోగ్యశ్రీ సేవల తనిఖీ



ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సీఈఓ విశాలాక్షి

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో కొనసాగుతున్న ఆరోగ్యశ్రీ సేవలను మంగళవారం సాయంత్రం ఆరోగ్యశ్రీ సీఈఓ విశాలాక్షి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని డయాలసిస్ వార్డును పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వీస్ బాగుందని కితాబిచ్చారు. ఆమె వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాల్వన్‌కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా ఇంచార్జి వీరేశం, డాక్టర్ శాంతప్ప తదితరులు ఉన్నారు.

ఆలయ భూముల పరిశీలన



బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద విజిలెన్స్ అధికారుల బృందం

తుర్కయంజాల్: తెలంగాణ విజిలెన్స్ అధికారుల బృందం రెవెన్యూ, దేవాదయ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయ భూములను పరిశీలించారు. ఆలయ భూము ల కబ్జా వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు స్వయంగా పరిశీలించారు. ఇంజాపూర్ సర్వే నంబర్ 130లో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించి, రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతిని కోరారు.

అన్నిరంగాల్లో రాణించాలి



వికారాబాద్ అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



మహిళా సంక్షేమ సంబరాల్లో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి

- మహిళలు తలుచుకుంటే సాధ్యం కానిది లేదు
- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- చట్టసభల్లో యాభైశాతం రిజర్వేషన్లు కల్పించాలని సూచన

వికారాబాద్ అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేయాలని, మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పి.సునీతారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గౌలికర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ చంద్రకళ, ఆర్డీఓ విజయ కుమారి జిల్లా మహిళా సంక్షేమ అధికారి లలిత కుమారి తదితరులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో స్త్రీ, పురుషులు సమానమేనని తెలిపారు. సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆచారాలే ఆడ, మగ అనే తేడాను చూపిస్తున్నాయన్నారు. చదువుతో పాటు మహిళలు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారని వివరించారు. చట్ట సభల్లో మహిళలకు యాభైశాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

మహిళలకే మొదటి ప్రాధాన్యం


ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టే ప్రతి పథకంలో మహిళలకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కేసీఆర్ కిట్‌తో పాటు, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్, వడ్డీ లేని రుణాలు, ఇంటింటికీ భగీరథ నీరు అందించి గౌరవిస్తున్నారని స్పష్టంచేశారు.

మహిళా సంక్షేమం దేశంలోనే ఆదర్శం

తాండూరు టౌన్: మహిళ, శిశు సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా సంక్షేమ సంబరాల్లో పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన ఆహార స్టాళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తల్లీబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం ఆరోగ్యలక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌తో పాటు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తోందన్నారు.పిల్లల రక్షణ, భద్రత కోసం రాష్ట్రంలో 17 శిశు గృహాలు, 35 బాల సదనాలు, 7 జువైనల్ హోమ్స్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు.షీ టాక్సీ పథకం ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు దేశంలోనే తొలిసారిగా మహిళల కోసం హైదరాబాద్‌లో ప్రభుత్వ మోటార్ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన మహిళా అధికారులు, సిబ్బందికి అవార్డులు అందజేశారు. శ్రీనిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, ఆర్డీఓ అశోక్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, అంగన్‌వాడీ, సెర్ప్, ఐకేపి, మెప్మా, మహిళా సంఘాల మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య మహిళ కేంద్రాల ప్రారంభం

వికారాబాద్ అర్బన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఆరోగ్య దినత్సోవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా వైద్యారోగ్య శాక అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలో మూడు మహిళా ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించనున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై గతంలోనే దృష్టి సారించిన ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆరోగ్య మహిళ పేరుతో గ్రామీణ, పట్టణ మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ప్రతీ మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది.మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వం దశల వారీగా సెంటర్లను ప్రారంభిస్తోంది. వికారాబాద్‌లోని రామయ్యగూడ, దోమ, యాలాల పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ తెలిపారు.



రామయ్యగూడలోని ఆరోగ్య మహిళా కేంద్రం

మీరే సారథులు వారథులు

రాబోయే ఎన్నికలే లక్ష్యం



బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు దిశానిర్దేశనం చేస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి తలసాని

- పార్టీ బలోపేతంలో భాగస్వాములు కావాలి
- పరిపాలన వికేంద్రీకరణతో మెరుగైన ఫలాలు
- నగరాభివృద్ధికి ఏం చేశామో ప్రజలకు చెప్పండి
- ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయాలను వినియోగించుకోండి
- బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం

సాక్షి, సిటీబ్యూరో: ఓవైపు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్తూనే మరోవైపు పార్టీ బలోపేతానికి బాగా పనిచేయాలని మంత్రి కేటీఆర్ జీహెచ్‌ఎంసీలోని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు. ఈ నెల 16న నగరంలోని 150 వార్డుల్లో వార్డు కార్యాలయాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రగతి భవన్‌లో పార్టీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రానున్న సంవత్సరకాలం పాటు పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా ఉంటాయని, వాటన్నింటినీ విజయవంతం చేస్తూ పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆదేశించారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేయాలన్నారు. సమావేశాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని, పార్టీ బలోపేతం ద్వారానే మనం రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వస్తామన్నారు. కార్పొరేటర్ల సారథ్యంలో తమతమ వార్డుల్లో పార్టీని ఎన్నికలకు సమాయత్తం చేయాలన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతోపాటు నగరాభివృద్ధికి పాటుపడుతున్న తీరును విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి మార్గదర్శనం చేశారు. వార్డు కార్యాలయాల ఏర్పాటు ద్వారా ప్రజలకు మరిన్ని సేవలందిస్తూ వారితో మమేకమయ్యే అవకాశం ఏర్పడుతుందన్నారు. నగరంలో సుపరిపాలన మరింత బలోపేతం కానుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లు వార్డు కార్యాలయాల వ్యవస్థను విస్తృతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. దాదాపు ఆర్నెల్లలో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండటం తెలిసిందే. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం తథ్యమని మంత్రి పునరుద్ఘాటించారు. రాబోయే నెలల్లో జరగనున్న పార్టీ కార్యకలాపాలపై కార్పొరేటర్లకు అవగాహన కల్పించారు.

వికేంద్రీకరణతో ప్రజలకు మేలు..

పరిపాలన వికేంద్రీకరణతో ప్రజలకు ఎంతో సదుపాయమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మరిన్ని సంక్షేమ ఫలాలను, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వేగంగా అందించాలనే తలంపుతోనే వికేంద్రీకరణ సంస్కరణలు చేపట్టారని చెప్పారు. అందులో భాగంగానే కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు,మండల కేంద్రాలు,గ్రామపంచాయతీలు ఏర్పాటుచేసి ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల ఇంటిముందుకు వెళ్లేలా చేశారన్నారు. అదే స్ఫూర్తితో జీహెచ్‌ఎంసీలోనూ వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా నగర ప్రజలకు సత్వరమే కాక మరిన్ని సేవలందుతాయనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి వార్డు కార్యాలయ వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదన్నారు. వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవాలకు తమ పరిధిలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, కాలనీ సంఘాలు, ప్రముఖులను కలుపుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వార్డు కార్యాలయ వ్యవస్థపై కార్పొరేటర్లకు అవగాహన కల్పించేందుకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఒక విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, శంభీపూర్ రాజు, మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు క్లాస్

- ఎమ్మెల్యేలతో పోటీ పడొద్దు
- లేదంటే పార్టీ నష్టపోతుంది
- పార్టీ ఇచ్చిన పనిచేయండి
- ఎమ్మెల్యేలతో సమస్యలుంటే చెప్పండి

కొన్ని నియోజకవర్గాల్లో కార్పొరేటర్లకు ఎమ్మెల్యేలతో విభేదాలుండటాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. 'మీరు ఎమ్మెల్యేలతో పోటీపడుతున్నారు. మీకు మీరే ఎమ్మెల్యేలుగా భావిస్తున్నారు. పార్టీ ఇచ్చిన పని చేయండి. మీ సేవల్ని పార్టీ గుర్తిస్తుంది. జాతీయ పార్టీగా ఎదుగుతున్న క్రమంలో ఈ వైఖరి మంచిది కాదు. ఎవరికి వారే ఎమ్మెల్యేలనుకుంటే పార్టీ నష్టపోతుంది. అందరూ కలిసిమెలిసి పని చేయాలి. ఎవరికి టిక్కెట్ ఇవ్వాలన్నది సమయం వచ్చినప్పుడు పార్టీ నిర్ణయిస్తుంది. ఎమ్మెల్యేలతో మీకు ఏవైనా సమస్యలుంటే నాదృష్టికి తెండి. రాబోయే రోజులు ఎంతో కీలకమైనవైనందున అందరూ కలిసిమెలిసి పనిచేయాలని స్పష్టం చేశారు. చాలామంది కార్పొరేటర్లు జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని సైతం మంత్రి తప్పుబట్టారు.అన్ని సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. మేయర్ సైతం తరచూ టీ, కాఫీ చర్చల వంటివి ఏర్పాటు చేయాలని.. అందరూ పార్టీకోసం పని చేయాలన్నారు. ప్రజా సమస్యలు విస్మరించొద్దు. వార్డు కార్యాలయాలకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారమయ్యేలా చూడాలి. మీరు చెప్పేవి చేసేలా అధికారులుండాలి అని చెప్పినట్లు సమాచారం. వార్డు కార్యాలయాలను కార్పొరేటర్లతోనే ప్రారంభింపజేయాలని, కార్పొరేటర్లు లేని ప్రాంతాల్లో ఎమ్మెల్యే వంటివారితో ప్రారంభింపజేయాలన్నారు.

క్లుప్తంగా

కోట్‌పల్లికి ఉత్తమ అవార్డు



జెడ్పీ చైర్‌పర్సన్ నుంచి ఉత్తమ అవార్డు అందుకుంటున్న మహిళా సమాఖ్య సభ్యులు

బంట్వారం: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ మండల సమాఖ్య అవార్డు కోట్‌పల్లికి దక్కింది. మంగళవారం వికారాబాద్‌లో నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ చేతుల మీదుగా మండల సమాఖ్య సభ్యులు అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి ఏపీఎం శివయ్య, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాన్ని తొలగిస్తే సహించం



గుట్టపై ఆంజనేయస్వామి విగ్రహం వద్ద యువజన సంఘాల సభ్యులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని సుంకర్‌గుట్టపై ఉన్న ఆంజనేయ విగ్రహాన్ని తొలగిస్తే సహించేదిలేదని యువజన సంఘాల నాయకులు స్పష్టం చేశారు. సుంకర్ గుట్టను తవ్వుతున్న కాంట్రాక్టర్ విగ్రహాన్ని తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం నాయకులు గుట్టకు వెళ్లి పరిశీలించారు. అక్కడ సదరు కాంట్రాక్టరు లేకపోవడంతో పనిచేసే సిబ్బందికి చెప్పారు. అనంతర స్థానిక యువత గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహం తొలగించవద్దని కోరుతూ బైక్‌ర్యాలీ నిర్వహించారు. అక్కడ తవ్వకాలను నిలిపివేయాలని సూచించారు.

కలప ట్రాక్టర్ పట్టివేత



బషీరాబాద్: చెట్లను నరికి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలపను మంగళవారం పర్యావరణ పరిరక్షణ కార్యకర్తలు అడ్డుకున్నారు. మండలంలోని కాశీంపూర్ నుంచి లక్ష్మీనారాయణపూర్ తరలిస్తుండగా తాండూరు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఫారెస్టు రేంజర్ శ్యాం సుందర్‌రావు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి

పరిగి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పలు విత్తన డీలర్స్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దుకాణాల్లో గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలనే విక్రయించాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదును ఇవ్వాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే వారి లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు అన్ని బీటీ రకాలే కనుక రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సులు భద్రమేనా?

రోడ్లపై రయ్‌రయ్.. ఫిట్‌నెస్ నైనై

- కండీషన్ లేనివి 80 శాతం పైనే
- తనిఖీలు చేపట్టని ఆర్టీఏ అధికారులు
- నిబంధనలు బేఖాతర్
- భయాందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు

తాండూరు టౌన్: పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే రయ్‌రయ్ మంటూ వెళ్తున్నాయి. చిన్నారుల జీవితాలతో ప్రైవేటు స్కూల్ బస్సుల యజమానులు చెలగాటమాడుతున్నారు. ఆర్టీఏ అధికారుల తనిఖీలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. డొక్కు బస్సులతోనే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే పాఠశాలలు పునః ప్రారంభం అయినప్పటికీ బస్సుల ఫిట్‌నెస్, పర్మిట్‌లను రవాణా శాఖాధికారులు తనిఖీలు చేయలేదు. దీంతో పలు బస్సులకు ఫిట్‌నెస్, పర్మిట్ లేకున్నా రోడ్డెక్కి దర్జాగా స్కూల్ పిల్లలను తరలిస్తున్నాయి. బస్సు పూర్తి స్థాయి కండీషన్‌లో ఉంటేనే రోడ్లపై తిరగడానికి అర్హత ఉంటుంది. కండీషన్ లేని బస్సులు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో పిల్లలను తరలించినపుడు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఆర్టీఏ అధికారులు స్కూల్ బస్సులను తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం లేని బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

20 శాతం బస్సులకే ఫిట్‌నెస్

జిల్లా పరిధిలో పలు ప్రైవేటు స్కూళ్లలో కలిపి మొత్తంగా 191 స్కూల్ బస్సులు ఉన్నాయి. గతేడాది అక్కడక్కడా పలు స్కూల్ బస్సులు విద్యార్థులను తరలిస్తూ ప్రమాదాలకు గురైన విషయం తెలిసిందే. 191 బస్సుల్లో ఈ ఏడాది ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్న బస్సులు కేవలం 38 మాత్రమే ఉండటం విశేషం. మిగిలిన 153 బస్సులు అంటే 80శాతం బస్సులు ఎలాంటి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోకుండానే విద్యార్థులను తరలిస్తున్నారు. యాజమాన్యాలతో కుమ్మక్కై అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని, తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సుల వల్ల ఏదైనా ప్రమాదం సంభవించినపుడు హంగామా చేయకుండా ముందు జాగ్రత్తగా బస్సులను తనిఖీలు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

కానరాని సేఫ్టీ పరికరాలు

- ఫిట్‌నెస్, పర్మిట్‌లు మాత్రమే కాకుండా ప్రతి స్కూల్ బస్సులో ఆర్టీఏ నిబంధనల ప్రకారం అన్ని వసతులు ఉండాలి.

	ఫిట్‌నెస్ ఉన్నవి	లేనివి	మొత్తం
వికారాబాద్	24	67	91
పరిగి	06	45	51
తాండూరు	06	31	37
కొడంగల్	02	10	12

- చిన్నారులు కిటికీల నుంచి బయటకు తొంగి చూడకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి.
- ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ప్రాథమిక చికిత్స చేయడానికి అవసరమైన ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉండాలి.
- బస్సులో అత్యవసర ద్వారం ఏర్పాటు చేయాలి. స్కూల్ బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక ర్యాక్స్ ఉండాలి.
- బస్సు బయట రేడియం స్టిక్కర్లు అంటించాలి. ప్రమాదం జరిగినపుడు అద్దాలను పగుల గొట్టేందుకు సుత్తె వంటి పనిముట్లు ఉండాలి.
- అగ్ని ప్రమాదం సంభవించినపుడు మంటలను ఆర్పేందుకు అవసరమైన అగ్ని నిరోధక రసాయన సిలిండర్‌లు ఉండాలి. అలాగే 60 ఏళ్ల పైబడిన వ్యక్తులు స్కూల్ బస్సులు నడపరాదు.
- ఇలాంటి నిబంధనలతో కూడిన బస్సుల్లో మాత్రమే విద్యార్థులను తరలించేందుకు అనుమతులు ఇస్తారు. నిబంధనల ప్రకారం లేని బస్సులను ఆర్టీఏ అధికారులు సీజ్ చేయాల్సి ఉంటుంది.

"తనిఖీలు ముమ్మరం చేశాం

పాఠశాలలు ప్రారంభం కాకముందే యాజమాన్యం బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. జిల్లాలో కేవలం 38 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. తనిఖీలు ముమ్మరం చేశాం. ఇప్పటికీ రెండు బస్సులను సీజ్ చేశాం. నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బస్సులు నడిపితే చర్యలు తప్పవు.

– వెంకట్ రెడ్డి, ఆర్టీఓ



శిరీష మృతి చెందిన నీటి కుంటను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు

- కాళ్లాపూర్‌లో నీటికుంటను పరిశీలించిన ఎస్పీ కోటిరెడ్డి
- హత్యా? ఆత్మహత్యా? అనే మిస్టరీని ఛేదిస్తామనివెల్లడి



శిరీష కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేఏ పాల్

పరిగి: అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన శిరీష కేసును త్వరలోనే ఛేదిస్తామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. హత్యా, ఆత్మహత్యా అనే విషయంలో సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ చెప్పారు. మంగళవారం ఎస్పీ మండల పరిధిలోని కాళ్లాపూర్‌లో శిరీష మృతిచెందిన నీటి కుంటను పరిశీలించారు. కుంటలో ఎంత లోతులో నీళ్లు ఉన్నాయన్న విషయమై ఒకరిని నీటికుంటలో దింపి లోతును తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ శిరీష ఆత్మహత్యకు యత్నించిందనే విషయం తమకు తెలిసిందన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. శిరీష మృతదేహంపై పలు చోట్ల గాయాలున్నాయని, పోస్టుమార్టం రిపోర్టు వస్తే దర్యాప్తు మరింత ముమ్మరం చేస్తామన్నారు. ఫోన్ లాక్ ఉండటంతో సైబర్ క్రైంకు పంపించామని, సమాచారం సేకరిస్తున్నామన్నారు. ఫోన్ డాటా, ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు సాంకేతికత ఆధారాల పరిశీలించాకే శిరీషది హత్యా, ఆత్మహత్యా అనేది నిర్ధారిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేఏ పాల్ పరామర్శ

రాష్ట్రంలో రోజురోజుకు మహిళలు, విద్యార్థినులపై దాడులు, రేప్‌లు పెరిగిపోతున్నాయని.. ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. కాళ్లాపూర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన శిరీష కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కనుగుడ్లు పీకేస్తామన్న కేసీఆర్.. రాష్ట్రంలో ఎక్కడ చూసినా హత్యలు, అత్యాచారాలే జరుగుతున్నా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. శిరీష మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి శిరీష మృతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



స్త్రీ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- మహిళా సంఘాలకు స్త్రీ నిధి చెక్కుల అందజేత

కొడంగల్: రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా సంఘాలకు స్త్రీ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ యుగం నడుస్తోందన్నారు. కేసీఆర్ హయాంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందుతోందని తెలిపారు. ఆసరా ఫించన్లు, ఒంటరి మహిళలకు ఫించన్లు, స్థానిక సంస్థల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించినట్లు చెప్పారు. రైతులకు 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా ఇచ్చి ఆదుకుంటున్నట్లు తెలిపారు. రుణమాఫీ, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, ఆసరా ఫించన్లు, కేసీఆర్ కిట్టు పథకాలతో పేదలందరికీ మేలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వైకుంఠ ధామాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు నిర్మించినట్లు చెప్పారు. మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు వేస్తునట్లు చెప్పారు. కుల వృత్తుల వారికి ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కృష్ణన్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, ఏఎంసీ వైస్ చైర్ పర్సన్ వాణిశ్రీ, ఎంపీపీలు హేమీబాయి, విజయకుమార్, జెడ్పీటీసీ మహిపాల్, కౌన్సిలర్ మధుసూదన్‌రావు యాదవ్, సీడీపీఓ జయరాం, ఎంపీడీఓ పాండు, ఏపీఓ రాములు, ఏపీఎమ్ వెంకన్న, ఐసీడీఎస్ సిబ్బంది, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి కృషి



బోనాలు, బతుకమ్మలతో వస్తున్న మహిళలతో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ఎస్‌గార్డెన్‌లో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళా శ్రేయస్సు కోసం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ తరుణ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుల వెల్లువ



తహసీల్దారు కార్యాలయం వద్ద జనం

దౌల్తాబాద్: వెనుకబడిన తరగతుల కుటుంబాలకు ప్రభుత్వం అందించే రుణాల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దౌల్తాబాద్ తహసీల్దారు కార్యాలయం, మీసేవ కేంద్రాల వద్ద వందల సంఖ్యలో దరఖాస్తు దారులు పడిగాపులు కాస్తున్నారు. ఆదాయం , కుల ధ్రువీకరణ పత్రాల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకునేందుకు తరలివస్తున్నారు. ఎండలు మండుతున్నా లెక్క చేయకుండా యువత భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చారు. మొదట మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు ఫారాలు తీసుకుని అక్కడి నుంచి అధికారుల సంతకాలు కోసం రెవెన్యూ కార్యాలయానికి వస్తున్నారు. దీంతో కార్యాలయాలకు ఇతర పనులపై వచ్చే వారు కనీసం లోపలికి కూడా వెళ్లలేని పరిస్థితి కనిపించింది.

గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయి, చిత్రంలో నిందితులు

అనంతగిరి: ముంబైకి తరలిస్తున్న గంజాయిని మంగళవారం వికారాబాద్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం ఒరిస్సా నుంచి ముంబైకి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరు వ్యక్తులు గంజాయి తీసుకెళుతున్నట్టు పక్కా సమాచారం అందిందన్నారు. తాండూరు రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసుల సహాయంతో దాడులు చేయగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 45 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఒరిస్సా నుంచి ముంబై కి తరలించి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నవీన్ చంద్ర తెలిపారు.

బషీరాబాద్ ఎంపీపీపై అవిశ్వాసం

- తీర్మానంపై ఏడుగురు బీఆర్‌ఎస్ ఎంపీటీసీల సంతకాలు
- ఆర్డీఓకు నోటీసు అందజేత
- సభ్యులను శిబిరాలకు తరలించిన నేతలు
- రంగంలోకి దిగిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



ఎంపీపీ కరుణ



తాండూరు ఆర్డీఓకు అవిశ్వాస నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీలు

బషీరాబాద్: మండల పరిషత్ అధ్యక్షురాలు కరుణపై సొంత పార్టీ ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ అశోక్‌కుమార్‌కు ఏడుగురు ఎంపీటీసీల సంతకాలతో నోటీసు అందజేశారు. మొత్తం 12 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, ఎన్నికల ఖర్చు చూపనందున ఏడాది కిందట దామర్‌చెడ్ ఎంపీటీసీ రాజు సభ్యత్వాన్ని ఎన్నికల కమిషన్ రద్దు చేసింది. మిగతా 11 మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఏడుగురు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేశారు. వీరిలో వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, వడ్డే శ్రీనివాస్, లక్ష్మీబాయి, రేఖ, సురేష్, వినోద, షాజీదీబేగం ఉన్నారు. వీరు వైస్ ఎంపీపీ అన్నపూర్ణను ఎంపీపీ చేసేందుకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గం తెరవెనుక మంత్రాంగం నడిపిస్తున్నట్లు ప్రచారం. మరోవైపు ఎంపీపీ కరుణకు ఎంపీటీసీలు శ్రీధర్, రాజు, కుర్వ సునీత మద్దతుగా నిలిచారు. ఇదిలా ఉండగా ఎంపీటీసీలుగా 2019 జూన్ 7న ఎన్నికయ్యారని, ప్రమాణ స్వీకారం జూలై 4న జరిగిందని ఎంపీపీ వర్గం చెబుతుంది. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం వచ్చే నెల 4తో నాలుగు సంవత్సరాల పదవీకాలం పూర్తవుతుందని చెబుతున్నారు. ఇంకా గడువు ఉండగా అవిశ్వాసం పెట్టడం సాధ్యం కాదని ధీమావ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆరా..

తాండూరు అధికార పార్టీలో చాలా కాలంగా ఇద్దరి నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తుంది. ఈ క్రమంలో సొంత పార్టీ ఎంపీపీపై ఎమ్మెల్యే వర్గం అవిశ్వాస తీర్మానం పెట్టడంపై ఎమ్మెల్సీ వర్గం అలర్ట్ అయ్యింది. రంగంలోకి దిగిన ఎమ్మెల్సీ తెర వెనుక మంత్రాంగం చేస్తున్నారు. కరుణతో పాటు మద్దతుగా ఉన్నా ముగ్గురు ఎంపీటీసీలను కాపాడుకోవడానికి వారిని రహస్య ప్రాంతానికి తరలించారు. అలాగే నోటీసుపై సంతకాలు పెట్టిన సభ్యులను ఎమ్మెల్యే వర్గం కూడా క్యాంపునకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఎంపీపీపై అవిశ్వాసంతో అధికార పార్టీలో వర్గ పోరు తీవ్రస్థాయికి చేరిందని సర్వత్రా జోరుగా చర్చ జరుగుతోంది.

ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితులకు ఏడేళ్ల జైలు

ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా

ఇబ్రహీంపట్నం: ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగరాజు తీర్పునిచ్చారు. రాయపోల్‌కు చెందిన సార్ల సంతోషకు ఇబ్రహీంపట్నంకు చెందిన యాదగిరితో 2004లో వివాహం చేశారు. బంగారం, వెండి కట్నకానుకలిచ్చారు. భర్త ఇంట్లోలేని సమయంలో అత్త ముత్యాలు, మామ చంద్రయ్య, ఆడపడుచు సునీతలు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేశారు. వేధింపులు తాళలేక ఆమె 2020 అక్టోబరు 3న ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. వెంటనే ఆమెకు చికిత్స నిమిత్తం నగరంలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పుర్వాపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగరాజు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేవిధంగా ఆధారాలు సేకరించి న్యాయస్థానానికి సమర్పించిన పోలీసు సిబ్బందిని రాచకొండ కమిషనర్ చౌహాన్, జాయింట్ సీపీ సత్యనారాయణ అభినందించి రివార్డులు ప్రకటించారు.

రోడ్డుపై గుంత.. ఆదమరిస్తే చింత



గుంతపై ఏర్పాటు చేసిన చెట్టు కొమ్మలు

కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ –గండిచెరువు వరకు ఉన్న బీటీరోడ్డు ప్రమాదభరితంగా మారింది. దాస్యనాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కల్వర్టు వద్ద భారీగా గుంత ఏర్పడింది. రోడ్డు మధ్యలో గుంత ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొందని ఆయాగ్రామాల ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ఎవరూ ప్రమాదబారిన పడకుండా చెట్ల కొమ్మలు ఉంచారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– కుల్కచర్ల

ఎడ్‌సెట్ స్టేట్ టాపర్లకు సన్మానం



ఉత్తమ ర్యాంకులు సాధించిన అక్కా చెల్లెళ్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: ఎడ్‌సెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించిన ఇద్దరు అక్కా చెల్లెళ్లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహిళా సంక్షేమ సంబరాల్లో ఇద్దరినీ ఆయన అభినందించారు. పట్టణం గ్రీన్ సిటీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మొగులప్ప కుమార్తెలు గొల్ల వినీష ఎడ్‌సెట్ స్టేట్ మొదటి ర్యాంకు సాధించగా, మరో కూతురు గొల్ల శిరీష స్టేట్ 109వ ర్యాంకు సాధించారు. తాండూరు పేరును రాష్ట్ర స్థాయిలో నిలిపిన ఇద్దరినీ అభినందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సింధూ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు రంగారావు, డైరెక్టర్ విజయాదేవి, అధ్యాపకులు అభినందించారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

యాలాల: ఎడ్‌సెట్‌లో మొదటి ర్యాంకు సాధించిన వినీషను మంగళవారం పీఆర్‌టీయూ యాలాల మండల శాఖ తరఫున ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్ తదితరులు విద్యార్థి ఇంటికి వెళ్లి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.

పదేళ్లుగా అధ్వానమే

- ఎవరికీ పట్టని కొత్తూరు–వడిచర్ల రోడ్డు
- వాహనదారులకు తప్పని తిప్పలు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని కొత్తూరు–వడిచర్ల బీటీ రోడ్డు పదేళ్లుగా అధ్వానంగా ఉన్నా అధికారులు, నేతలు పట్టించుకోవడం లేదు. మండలంలో జాతీయరహదారి ఉన్నా, ఈ బీటీ రోడ్డు మరమ్మతు, అభివృద్ధికి నోచుకోవడం లేదు. వడిచర్ల– కొత్తూరు రహదారిపై మహంతీపూర్, కొత్తూరు వాగుల నుంచి జోరుగా, యథేచ్ఛగా ఇసుక రవాణా సాగేది. భారీ లారీలు రాకపోకలు కొనసాగేవి. దీంతో బీటీ రోడ్డు పాడై మట్టిరోడ్డుగా మారింది. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు ఇబ్బందిగా మారాయి. రోడ్డును బాగుచేయాలని ధర్నాలు, రాస్తారోకోలు, పాదయాత్రలు చేపట్టినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఎన్నికల వేళ హామీలిచ్చి అనంతరం విస్మరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు



కొత్తూరు-వడిచర్ల బీటీ రోడ్డు దుస్థితి